క్లుప్తంగా

యూటీఎఫ్ ధర్నాను విజయవంతం చేయండి

కొల్లిపర: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సమస్యలపై మంగళవారం నుంచి 36 గంటల పాటు విజయవాడలోని ధర్నాచౌక్‌లో జరగనున్న ధర్నాను ఉపాధ్యాయులు పాల్గొని పోరుబాటను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుర్రా కేదార్‌నాథ్ కోరారు. సోమవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి నెల 1వ తేదీనే జీతాలు చెల్లించాలని, పీఆర్‌సీ, డీఏలు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ తదితర ఆర్థిక బకాయిలు చెల్లించి, 30శాతం ఐఆర్ వెంటనే ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కాలేషావలి, యూటీఎఫ్ సీనియర్ నాయకులు మృత్యుంజయరావు, వరప్రతాప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై కేసు నమోదు

తెనాలిరూరల్: భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నందులపేటకు చెందిన శిరీష తనను భర్త విజయ్‌కుమార్ వేధింపులకు గురి చేస్తున్నాడని ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేసింది. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి వచ్చిన సమాచారం మేరకు టూ టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

బీసీ సంక్షేమ సంఘం క్యాలెండరు ఆవిష్కరణ



తెనాలి: బీసీ సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండరును సోమవారం స్థానిక గంగానమ్మ పేటలోని సంఘ కార్యాలయంలో సంఘం రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు గుర్రం ద్వారకా శ్రీను ఆవిష్కరించారు. బీసీ సంఘీయుల అభివృద్ధికి కృషి చేయాలని, ప్రభుత్వం కుల జనగణనను పూర్తిచేయాలని కోరారు. రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కొల్లూరు హనుమంతరావు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీలపై దాడులకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని కోరారు. సంఘం తెనాలి పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ వేములు కృష్ణ, సోమరౌతు సతీష్ పాల్గొన్నారు.



మంగళగిరి ఎన్ఆర్ఐ హాస్పిటల్‌లో సాయిలక్ష్మికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ మనోజ్ బాబీ



ధనలక్ష్మికి వృద్ధాప్య పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ లక్ష్మీ ప్రసన్న



సీతాకుమారికి దివ్యాంగ పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ వైష్ణవి

ముగిసిన పెన్షన్‌ల పంపిణీ

సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. వలంటీర్లు అందుబాటులో లేని, మిగిలిన వారికి వృద్ధాప్య, దివ్యాంగ, వితంతు, డీఎంఅండ్‌హెచ్‌వో పింఛన్లను పంపిణీ చేశారు. 10వ వార్డుకు చెందిన ఇంగువా సాయిలక్ష్మి అనారోగ్యంతో మంగళగిరిలోని ఎన్ఆర్ఐ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుంది. ఆ విషయం తెలుసుకున్న వలంటీర్ మనోజ్ బాబీ అక్కడే వృద్ధాప్య పింఛన్ పంపిణీ చేశారు. గంగానమ్మపేటకు చెందిన అక్కల ధనలక్ష్మికి వృద్ధాప్య పింఛన్ వలంటీర్ లక్ష్మీప్రసన్న, లక్ష్మీనగర్ కాలనీకి చెందిన ఎస్.సీతాకుమారికి దివ్యాంగ పింఛన్ వలంటీర్ వైష్ణవి, బి.శ్రావణి జ్యోతికి వలంటీర్ సుష్మ పంపిణీ చేశారు.

–తెనాలిఅర్బన్



శ్రావణి జ్యోతికి దివ్యాంగ పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ సుష్మ

పలు విద్యాసంస్థల్లో సంక్రాంతి వేడుకలు



విశ్వవేద స్కూల్‌లో బొమ్మకొలువు వద్ద ఉపాధ్యాయులు, చిన్నారులు



శ్రీ చైతన్య స్కూల్‌లో భోగి మంటల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



శ్రీ చైతన్య స్కూల్‌లో కోడి పందేలను వీక్షిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తెనాలిఅర్బన్: సంక్రాంతి వేడుకలను పలు విద్యాసంస్థల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు. అలాగే భోగి మంటలు, బొమ్మల కొలువులు ఏర్పాటు చేసి ఆనందంగా పండుగను జరుపుకున్నారు. అంగలకుదురులోని విశ్వవేద స్కూల్‌లో సంక్రాంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో అందమైన రంగవల్లులు రూపొందించి గొబ్బెమ్మలను ఏర్పాటు చేశారు. అలాగే భోగి మంటలు వేసి సందడి చేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కాట్రగడ్డ శ్రీనివాసరావు, అకడమిక్ ఇన్‌చార్జి అవనిగడ్డ భ్రమరాంబ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగానమ్మపేటలోని శ్రీ చైతన్య ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల రంగవల్లులు, గంగిరెద్దుల విన్యాసాలు, పతంగుల రెపరెపలతో పండుగ వాతావరణం నెలకొంది. అలాగే కోడి పందేలతో సందడి చేశారు. ముగ్గులు, పతంగుల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.రాధ, డీన్.మల్లిఖార్జునరావు, ఇన్‌చార్జులు మహీజాన్, నాగవల్లి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్ విగ్రహ స్థలం అభివృద్ధికి శంకుస్థాపన



తెనాలి: పట్టణ ఓవర్‌బ్రిడ్జి దగ్గర్లోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహం గల స్థలం అభివృద్ధి పనులను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. 34వ వార్డు పరిధిలో రణరంగచౌక్‌కు ఆనుకుని ఉన్న స్థలంలో కొండవీటి సేవాసమితి ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పార్కు ఏర్పాటుచేసి, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించారు. ఇటీవల మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం కూడా చేశారు. అందుకనుగుణంగా అభివృద్ధి పనులను ప్రారంభించారు. వార్డు కౌన్సిలరు, కొండవీటి సేవా సమితి అధ్యక్షుడు పేరం సంజీవరెడ్డి, రాష్ట్ర జల వనరుల కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, మున్సిపల్ ఇంజినీరు కె.నాగమల్లేశ్వరరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కనువిందుగా ధనుర్మాస వేడుకల శోభాయాత్ర



శోభాయాత్రలో ఎమ్మెల్యే శివకుమార్, చందు రామారావు ప్రభృతులు

తెనాలి: పట్టణానికి చెందిన శరణాగతి గోష్ఠి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధనుర్మాస వేడుకల్లో భాగంగా సోమవారం శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కాలేజి రోడ్డులోని యర్రంశెట్టి గంగాధర్, యర్రంశెట్టి రమేష్‌బాబు స్థలప్రాంగణంలో ధనుర్మాస ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈనెల 14 వరకు జరిగే కార్యక్రమాల్లో భాగంగా సోమవారం సాయంత్రం పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. నరేంద్ర రామానుజ దాసస్వామి నేతృత్వంలో మార్కెట్ సెంటర్లోని రాములవారి ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, ప్రియదర్శిని విద్యాసంస్థల చైర్మన్ చందు రామారావుతో కలిసి స్వామి వారి విగ్రహాన్ని చేతపట్టుకుని శోభాయాత్రలో పాల్గొన్నారు. కోలాట ప్రదర్శనలు, మేళతాళాలు, మంగళవాయిద్యాలతో శోభాయాత్ర పురవీధుల్లో కొనసాగింది. భక్తులందరూ కాషాయ జెండాలతో పాల్గొన్నారు. గోదాదేవి, శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి వేషధారణలు మరో ఆకర్షణ. కౌన్సిలర్లు గొడవర్తి సాయిహరేరామ్, తోట రఘురామ్, వైఎస్సార్‌సీపీ క్లస్టర్–1 అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, కఠారి హరీష్, పెనుగొండ వెంకటేశ్వరరావు, దోనుగుంట్ల రామమోహనరావు, తన్నీరు సీతారామయ్య, విష్ణుమొలకల వాలేశ్వరరావు, తమ్మన సాంబశివరావు, సమరసత ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, శరణాగతి గోష్ఠి సభ్యులు, దాస సాహిత్య ప్రాజెక్టు, హరే శ్రీనివాస భజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సమ్మె విరమించి ప్రభుత్వానికి సహకరించండి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



కార్మిక సంఘ నాయకులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు హెల్త్ ఇన్సూరెన్స్ రూ.6వేలు, వేతనం రూ.3వేలను పెంచడం జరిగిందని, ఈ విషయాన్ని కార్మికులు గుర్తించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మిక సంఘ నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.1000 వేతనం పెంచడానికి ముందుకు వచ్చేది కాదని తెలిపారు. కానీ తమ ప్రభుత్వం కార్మికుల కష్టాన్ని గుర్తించి అడగకుండానే వేతనం, ఇన్సూరెన్స్ పెంచిందని గుర్తు చేశారు. కార్మికులు సమ్మెను విరమించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. కమిషనర్ ఎం.జశ్వంతరావు మాట్లాడుతూ పట్టణంలో జరిగే పారిశుద్ధ్య నిర్వహణకు కార్మికులు సహకరించాలని సూచించారు. రోజువారి కూలీలను అడ్డుకోవడం వంటివి చేయవద్దన్నారు. ప్రభుత్వం మీ విషయంలో ఎంతో సానుకూలంగా ఉందని, ఆ విషయాన్ని గుర్తెరగాలని సూచించారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్‌వలీ, మంగళగిరి వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సామాజికతకు ప్రతిబింబం 'సూక్తి పద్యసుధ'



పుస్తకాన్ని ఆవిష్కరించిన డాక్టర్ గుమ్మా సాంబశివరావు

తెనాలి: పద్యరచనలోను సామాజికతకు 'సూక్తి పద్యసుధ' పుస్తకం నిదర్శనమని ప్రముఖ రచయిత, ఆంధ్ర లయోలా కాలేజి విశ్రాంత తెలుగు శాఖాధిపతి డాక్టర్ గుమ్మా సాంబశివరావు అన్నారు. తెనాలికి చెందిన పద్యకవి పిన్నక నాగేశ్వరరావు రచించిన సూక్తి పద్యసుధ పద్యసంపుటిని స్థానిక చెంచుపేటలోని రావి టవర్స్‌లో సోమవారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథి డాక్టర్ గుమ్మా సాంబశివరావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, సాహిత్య ప్రక్రియల్లో కథలు నీతిని పరోక్షంగా ప్రబోధిస్తే, పద్యాలు నేరుగా నీతిని చాటుతాయని చెప్పారు. నిత్యజీవితంలోని కొన్ని సూక్తులను తీసుకుని పద్యరూపమిచ్చిన అమృతమే ఈ పద్యసంపుటిగా చెప్పారు. గుర్రం జాషువా చెప్పినట్టు ఈ పుస్తక రచయితతోపాటు అంకితం తీసుకున్నవారు సైతం చిరంజీవులుగా మిగులుతారని అన్నారు. అధ్యక్షత వహించిన దూరదర్శన్ విశ్రాంత ఉపసంచాలకులు యార్లగడ్డ శైలజ మాట్లాడుతూ పుస్తకంలోని పద్యాలన్నీ దేనికదే సాటి అన్నట్టుగా సామాజికతను చాటుతాయని అన్నారు. సహజకవి అయినాల మల్లేశ్వరరావు తన ప్రసంగంలో తెనాలిలోని పద్యకవుల్లో పిన్నక నాగేశ్వరరావు అగ్రగణ్యులని చెప్పారు. రచయిత పిన్నక నాగేశ్వరరావు మాట్లాడుతూ 1965 నుంచి పద్యరచనలో కొనసాగుతూ, ఇప్పటివరకు 5 వేల పద్యాలను రచించినట్టు తెలిపారు. వాటిల్లోంచి ఎన్నదగిన పద్యాలతో ఏర్చికూర్చిన సూక్తి పద్యసుధ పుస్తకాన్ని తన సతీమణి స్వర్గీయ పిన్నక ధనలక్ష్మికి అంకితమిస్తున్నట్టు ప్రకటించారు. టీవీ నటి యార్లగడ్డ శరద్యుతి, పిన్నక శివలలితా జ్యోతి, శ్రీనివాసరావు, రమేష్‌బాబు, చందన, గరికపాటి సుబ్బారావు తదితరులు రచయితకు అభినందనలు తెలియజేశారు.

మారీసుపేటలో అగ్నిప్రమాదం



తెనాలిరూరల్: స్థానిక మారీసుపేట కొత్త వంతెన దిగువన గల ఓ ఇంట్లో సోమవారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. ఇక్కడి భవనంలోని మూడవ అంతస్తులో మంటలు చెలరేగి పెద్ద ఎత్తున ఎగసిపడ్డాయి. ఇంట్లోని భార్యభర్తలు ఇద్దరూ ఉదయమే పనికి వెళ్లడంతో స్కూల్ నుంచి అప్పుడే వచ్చిన వారి పిల్లలు స్నానం చేసేందుకని ఇంటి బయట బక్కెట్లో వాటర్ హీటర్ పెట్టి స్విచ్ ఆన్ చేశారు. కొద్ది సేపటికి స్విచ్ బోర్డు సహా వాటర్ హీటర్ పూర్తిగా కాలిపోయి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. మంటలు పక్కనే ఉన్న వాషింగ్ మిషన్‌కు వ్యాపించడంతో మరింత పెరిగాయి. ఇంట్లో ఉన్న పిల్లలు ప్రమాదాన్ని పసిగట్టి పక్క బిల్డింగ్ మీదుగా తప్పించుకున్నారు. చుట్టు పక్కల వారంతా మంటలు గమనించి ఆర్పేందుకు ప్రయత్నించారు. అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఎటువంటి ప్రాణహాని జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

బ్రెయిన్ ట్యూమర్ బాధితురాలికి ఆర్థిక సహాయం



పోలేరమ్మకు నగదు అందజేస్తున్న భరోసా సభ్యులు

తెనాలిటౌన్: రూరల్ మండలం నందివెలుగు గ్రామానికి చెందిన భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్న పోలేరమ్మ అనే మహిళకు రూ.25వేల నగదు ఆర్థిక సహాయం అందజేశారు. సత్తెనపల్లి గ్రామానికి చెందిన ఆకుల పోలేరమ్మ అనే మహిళ కొంత కాలంగా బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్న విషయం భరోసా సంస్థ సభ్యులు తెలుసుకున్నారు. ఆ మహిళను భరోసా సంస్థ అధ్యక్షులు కటికి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు పేరం లక్ష్మి, ప్రధాన కార్యదర్శి పిరాటి రమేష్, నరిశెట్టి మహేశ్వరరావులు సోమవారం పరామర్శించారు. ఆపరేషన్ నిమిత్తం పోలేరమ్మకు రూ.25వేల నగదు అందజేసినట్లు తెలిపారు. సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు శ్రీకాంత్ చెప్పారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్ పోటీలను సోమవారం నిర్వహించారు. హెచ్‌ఎం వి.పూర్ణ చంద్రశేఖరరావు మాట్లాడుతూ విజయవాడ పీడబ్ల్యూడీ గ్రౌండ్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 19వ తేదీన ఆవిష్కరించనున్నారని, ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు పాఠశాలలోని విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రావెళ్ల శ్రీనివాసరావు, ఎస్.శ్రీదేవి, టి.నిర్మల జ్యోతి పాల్గొన్నారు.

ఘనంగా జన్ భగీరథీ



పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య

మేడికొండూరు: మండల పరిధిలోని డోగిప్రరు సచివాలయం వద్ద సోమవారం ఘనంగా జన్ భగీరథీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 125 అడుగుల ఎత్తు ఉన్న కాంస్య విగ్రహం ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచి కొండెపోగు సాంమ్రాజ్యం, పంచాయతీ కార్యదర్శి బి.రమేష్, వెల్ఫేర్ సెక్రటరీ కొప్పుల దివ్య, షర్మిల పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

పెదనందిపాడు: వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పెదనందిపాడు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా దర్శికి చెందిన కనపర్తి కేజియా (19) పెదనందిపాడు మండలం అన్నపర్రు గ్రామానికి చెందిన రాజుపాలెం సాంబయ్యకు మూడు సంవత్సరాల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం అయ్యారన్నారు. తర్వాత ప్రేమగా మారిందని ఇరువురి పెద్దల సమక్షంలో మూడు నెలల క్రితం వివాహం చేసుకున్నారని వివరించారు. అయితే కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తుతున్నాయి. వీటికితోడు అత్తమామలు, బంధువులు వేధింపులు ఎక్కువగా ఉండటంతో సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో కేజియా ఊరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని అనుమానాస్పదస్థితిలో కనిపించిందన్నారు. మృతురాలి తల్లి కనపర్తి కోటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.